## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ మండల కమిటీ నియామకం

పిఠాపురం: వైఎస్సార్ సీపీ పిఠాపురం మండల నూతన కమిటీని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. వైఎస్సార్ సీపీ పిఠాపురం మండల కమిటీ ఉపాధ్యక్షులుగా పసుపులేటి చైతన్యకుమార్, చింతాడ రాంబాబు, ప్రధాన కార్యదర్శులుగా వెన్నపు బుల్లబ్బాయి, రెడ్డి పార్థసారథి, వెనుగంటి సుబ్బారాయుడు, పీటల ప్రవీణ్, కార్యదర్శులుగా గరగ మహేశ్వరరావు, కొప్పన సోమరాజు, కేశవరపు త్రిమూర్తులు, దడాల వీర్రాజు, గట్టి బుల్లిరాజకుమార్, సభ్యులుగా తుమ్మలపల్లి నానీ, తమ్మనబోయిన అయ్యన్న, బస్వా వీరబాబు, దడాల అప్పన్న, పెద్దింటి సురేష్ రెడ్డి, ఎరిగెల ప్రసాదరావు, కె.సునీల్‌దత్తా, చక్రవర్తుల సత్తిరాజు, కురాకుల విష్ణుమూర్తి, చెల్లి రమేష్, రాజాల చక్రం, పెదిరెడ్ల శ్రీనివాసరావు నియమితులయ్యారు.

### రైల్వే జీఎంకు వీడ్కోలు



జీఎంకు వీడ్కోలు పలికిన స్టేషన్ మేనేజర్

సామర్లకోట: తుని నుంచి విజయవాడ వరకు రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవత్సవ బుధవారం విండో ఇన్‌స్పెక్షన్ నిర్వహించినట్లు స్థానిక రైల్వే మేనేజర్ రమేష్ తెలిపారు. ప్రత్యేక రైలులో తుని నుంచి జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆయన పరిశీలించారు. రాజమండ్రిలో జరిగే పుష్కరాలను పురస్కరించుకొని రాజమహేంద్రవరం, ఏలూరు రైల్వే స్టేషన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను జీఎం పరిశీలించారు. తుని నుంచి సామర్లకోట మీదుగా వెళ్లిన ప్రత్యేక రైల్వేలో ఉన్న జీఎంకు మేనేజరు రమేష్‌తో పాటు ఎడీఈఎన్ శివప్రసాద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి వీడ్కోలు పలికారు.

### నేడు, రేపు ఉపవాస కూడికలు

పెద్దాపురం: మండలంలోని దివిలి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ప్రపంచ శాంతికై ప్రతీ ఏటా నిర్వహించే ఉపవాస ప్రార్థనా కూడికల్లో భాగంగా ఈ నెల 7, 8 తేదీల్లో మండలంలోని చదలాడ చర్చిలో ఉపవాస ప్రార్థనలు సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుధీప్, కేఎస్‌పీఎం మందిరాల వ్యవస్థాపకులు నంగిన సత్యానందం తెలిపారు. బుధవారం చదలాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రెండు రోజుల పాటు నిర్వహించే ఉపవాస ఉజ్జీవ వేడుకలు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి ఏడు వరకు ప్రార్థనా కూడికలు ఉంటాయన్నారు. ఆయా కూడికల్లో దైవజనులు టి.ప్రకాష్‌పాల్, ఎస్.ఎలిషా, వి.జాన్, కె.జయకుమార్ వాక్య సందేశాలను అందిస్తారన్నారు.

### ఆకతాయిలపై కేసు నమోదు



విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ స్కూల్ వద్ద బైక్‌లపై విన్యాసాలు చేస్తూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేసిన ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆకతాయి వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏ విద్యార్థుల వద్ద విన్యాసాలు చేసారో అదే విద్యార్థుల ముందు ఆకతాయిలను నిలబెట్టి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎవరైనా ఇటువంటి పనులు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. విద్యార్థులు మోటారు సైకిళ్లపై లైసెన్సు లేకుండా తిరిగినా, విన్యాసాలు చేసినా చర్యలు తప్పవన్నారు. ఎటువంటి లైసెన్సు లేకుండా ఇద్దరు యువకులు వేరే వాళ్ల బండి తెచ్చి దానిపై విన్యాసాలు చేశారని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. పాఠశాలలు, కాలేజీల వద్ద నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

### రాజ భాషపై పట్టు ఉండాలి




సమావేశంలో మాట్లాడుతున్న హిమంత్ వాడేకర్

సామర్లకోట: ప్రతి రైల్వే ఉద్యోగి రాజ భాష (హిందీ)పై పట్టు కలిగి ఉండాలని విశిష్ట రాజ భాష అధికారి హిమంత్ వాడేకర్ (విజయవాడ) అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్‌లో రాజ భాష త్రైమాసిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతిరోజు రైల్వే నోటీసు బోర్డుపై ఒక హిందీ పదం రాయాలన్నారు. అదే విధంగా రైల్వే ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్న సమయంలో హిందీని తప్పనిసరిగా వాడాలని సూచించారు. ప్రతి ఉద్యోగి రాజ భాషపై పురోగతి సాధించాలన్నారు. స్టేషన్ మేనేజరు రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, రాజ భాష పురోగతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కష్టాల్లో కాలనీళ్లు



అంధకారంలో పెద్దాపురం జగనన్న కాలనీ






జగనన్న కాలనీలో శిథిలమైన వాటర్ ట్యాంక్

- నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న జగనన్న, ఎన్టీఆర్ కాలనీ వాసులు
- నెలలు గడుస్తున్నా నీళ్లు అందని పరిస్థితి
- వెలగని విద్యుత్ లైట్లు, అంధకారంలోనే కాలనీలు

పెద్దాపురం: కూటమి పాలనలో గుక్కెడు నీళ్లు కావాలంటే రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. నీళ్లు అంది తమ కష్టాలు తీరతాయని ఎదురుచూస్తున్న ఆ కాలనీవాసులకు పది రోజులైనా చుక్క నీరు అందలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప వాళ్లకు మాత్రం చుక్కనీరు అందించిన దాఖలాల్లేవు. పట్టణంలోని సూరంపాలెం రోడ్డు జగనన్న కాలనీ, ఎన్టీఆర్ కాలనీ ప్రజల అవస్థలు వర్ణనాతీతం. పట్టణంలో పైపులైన్ల మరమ్మతులు, ట్యాంక్ లీకుల పేరుతో పది రోజులుగా పట్టణంలో ప్రజలకు మంచినీరు అందక ఇక్కట్లు పడుతున్నారు.

**సమస్యలు విలయ తాండవం**

స్థానిక సూరంపాలెం రోడ్డు జగనన్న కాలనీ, జగ్గంపేట రహదారిలోని ఎన్టీఆర్ కాలనీల్లో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వస్తే తమ కాలనీకి అన్ని వసుతులు వచ్చేస్తాయనుకున్న కాలనీ వాసులకు ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి దాటినా ఏ ఒక్క సమస్య పరిష్కరమైన దాఖలాల్లేవు. ఎక్కడా చూసిన అపారిశుధ్యం, మంచినీటి పైపులైన్ల లీకులతో పాటు, పిచ్చి తుప్పలు పేరుకుపోయి విష సర్పాల సంచారం ఎక్కువ అవ్వడంతో భయాందోళన మధ్య ప్రజలు జీవనం సాగిస్తున్నారు. కాలనీలో కనీస వసతులు కల్పించాల్సిన మున్సిపల్ యంత్రాంగం పారిశుధ్య నిర్వహణ, పైపులైన్ల మరమ్మతులపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పూర్తి స్థాయిలో మంచినీటి వసతి, పరిశుభ్రమైన వాతావరణం లేకపోగా.. రాత్రి అయితే విద్యుత్ దీపాలు వెలగక చీకటిలో జీవనం సాగించాల్సి వస్తుందని ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నీరు నిల్వ చేసే ట్యాంక్ శిథిలమైనా**

స్థానిక జగనన్న కాలనీలో నీటి నిల్వ చేసే ట్యాంక్ శిథిలమైనా సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారు. కాలనీవాసులు తమ నీటి ఇబ్బందులు పరిష్కరించండి మహాప్రభో అని వేడుకున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు. ఎన్టీఆర్ కాలనీలోని అపార్ట్‌మెంట్‌ల్లో ఎక్కడికక్కడే వాటర్ ట్యాంక్‌లు లీకేజీ కావడంతో కాలనీలో నీటి వృథా అవుతుంది. ఉదయం ఏడు గంటలకు మున్సిపల్ వాటర్ పంపిణీ చేసేటప్పటికీ.. ప్రతి అపార్ట్‌మెంట్లో పైపులైన్లు పగలడంతో నీరు కాలువల్లోకి చేరుతుందే తప్ప ప్రజలకు ఉపయోగపడటం లేదు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు మంచినీటి పైపులైన్ల లీకేజీలపై దృష్టి సారించాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో కాలనీవాసులు నానావస్థలు పడుతున్నారు. గత నాలుగు రోజులుగా కాలనీకి రావాల్సిన మంచినీటి సరఫరా పూర్తిగా రాకపోవడంతో కాలనీ వాసులు గుక్కెడు నీటికి కరవయ్యారు.

**అంధకారంలోనే కాలనీలు**

సుమారు మూడు వేల కుటుంబాలు నివాసం ఉంటున్న జగనన్న, ఎన్టీఆర్ కాలనీ ప్రజలు వారం రోజులుగా అంధకారంలోనే జీవిస్తున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలు, వీధిలైట్లు వెలకగ నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇళ్లల్లో చిన్న, చిన్న చోరీలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇదే అదునుగా దొంగలు హల్‌చల్ చేయడంతో ఆయా కాలనీవాసులు భయాందోళన మధ్య జీవనం సాగిస్తున్నారు. సంబంధిత విద్యుత్, మున్సిపల్ అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.

**పాములు హల్‌చల్**

కాలనీలు పిచ్చి తుప్పలు పేరుకుపోవడంతో పాముల సంచారం ఎక్కువైంది. దీంతో ఏ సమయంలో ఏం జరుగుతుందోనన్న భయంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. పాములు ఇళ్లల్లో చేరి హల్‌చల్ చేయడంతో ప్రజలు ఆవేదన అంతాఇంతా కాదు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్, శానిటరీ సిబ్బంది పూర్తి స్థాయిలో పారిశుధ్య పనులు చేపట్టి పిచ్చి మొక్కలు తొలగించాలని కాలనీల వాసులు కోరుతున్నారు.

**కాలనీలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం**



ఎన్టీఆర్ కాలనీలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కనీస వసతులు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా సక్రమంగా లేక నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు. అపార్ట్‌మెంట్‌లో చాలా వరకు అసలు ఓనర్లు లేకపోవడంతో అద్దెకు ఉండే వాళ్లు ఫ్లాట్లను శుభ్రంగా ఉంచడం లేదు. దీంతో అధికారులు కూడా కాలనీ వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేకపోవడంతో ఇక్కడ ప్రజల సమస్యలు వర్ణణాతీతం.
– సుబ్బులక్ష్మి, ఎన్టీఆర్ కాలనీ, పెద్దాపురం

**కాలనీ సమస్యలు పరిష్కారానికి చర్యలు**



జగనన్న కాలనీ, ఎన్టీఆర్ కాలనీ వాసుల సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపడతాం. త్వరలోనే నీటి సరఫరాను పునరుద్ధరించి మంచినీటి సరఫరా సక్రమంగా జరిగేలా చూస్తాం. నిత్యం పారిశుధ్య పనులు చేయించి, పైపులైన్ల లీకులు, అక్కడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం.
– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

## ఓటమి భయంతో టీడీపీ మూకల దాడులు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు



ఆవాల లక్ష్మీనారాయణ

సామర్లకోట: కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతోనే టీడీపీ మూకలు వైఎస్సార్ సీపీ క్యాడర్‌పై దాడులు చేస్తున్నారని, ఈ దాడులను తీవ్రంగా ఖండించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఉప ఎన్నికకు సంబంధించి టీడీపీలో పెదబాబు, చినబాబులకు ఓటమి భయం పట్టుకుందన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్డు మీదకు వస్తూ ఉంటే టీడీపీలో ఒణుకు పుడుతుందన్నారు. దీనిలో భాగంగానే వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయపెట్టడానికి దాడులు చేస్తున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ నాయకుడు వేల్పుల రాము ప్రయాణిస్తున్న కారును పులివెందుల మండలం నల్లగొండువారి పల్లిలో టీడీపీ గుండాలు దాడి చేసి అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న వారిపై దాడి చేయడంతో వారు గాయపడ్డారని తెలిపారు. స్థానికులు హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారని చెప్పారు. ఈ దాడిని అత్యంత హేయమైన చర్యగా భావిస్తూ.. తీవ్రంగా ఖండిస్తామన్నారు. ఈ దాడి బీసీ నాయకులపై కాదని, రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలపై దాడిగా భావిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం



కాశీ విశ్వనాథ్

పిఠాపురం: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులు, శాసన మండలి సభ్యుడు రమేష్ యాదవ్‌పై కూటమి గుండాలు దాడి చేయడం అమానుషమని పిఠాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ నేత పితాని కాశీ విశ్వనాథ్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రమేష్ యాదవ్, ఇతర వైఎస్సార్ సీపీ నాయకులపై కూటమి మూకలు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో న్యాయబద్ధంగా జరగాల్సిన ఎన్నికలు కూటమి ప్రభుత్వం వచ్చాక అరాచకంగా భయభ్రాంతుల నడుమ జరుగుతున్నాయని వాపోయారు. కూటమి నేతలు దాడులను ప్రోత్సహిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రతిపక్షాలను ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తోందన్నారు. ఈ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని గుర్తించుకోవాలని హెచ్చరించారు.

## ఆనందమీనందమాయె..



మత్స్యకారులకు చిక్కిన చేపలు



**మత్స్యకారులకు చిక్కిన భారీ మత్స్య సంపద**

కొత్తపల్లి: అమీనాబాద్ శివారు చేపలరేవు బుధవారం భారీ మత్స్య సంపదతో కళకళలాడింది. బోట్లపై వేటకు వెళ్లిన మత్స్యకారులకు సుమారు 3 టన్నులు చేపలు లభించాయి. రూ.25 లక్షల విలువైన చేపలు వలలకు చిక్కాయి. ఈ చేపలను వ్యాపారులు కొనుగోలు చేసి తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగుళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేశారు.

ఇటీవల కోణాం చేపల వ్యాపారం జోరుగా సాగుతోంది. సుమారు కేజీ చేప రూ.600 నుంచి రూ.700 ధర పలుకుతోంది. కోణాలు, చందువ చేపలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు పోటీ పడుతున్నారు.

### పాఠశాలకు సామగ్రి అందజేత



పాఠశాల హెచ్‌ఎం శాస్త్రికి మైక్‌సెట్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కొత్తపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు సామగ్రి బహూకరించారు. పాఠశాలకు చెందిన 1967–68 బ్యాచ్ ఎస్ఎస్ఎల్‌సీ విద్యార్థులు సుమారు రూ.30 వేల విలువ చేసే మైక్‌సెట్, రూ.10 వేలు విలువ చేసే కుర్చీలు, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.10 వేల నగదులను పాఠశాల హెచ్‌ఎం ఎస్‌వీఎల్ఎస్ శాస్త్రికి అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వడిసెట్టి సత్యనారాయణరెడ్డి, మేరా ఏసుదాసు, పెనుమల్లు వెంకట సూర్యచక్ర రెడ్డి, గుర్రాల చక్రరెడ్డి, కూనిశెట్టి తదితరులు పాల్గొన్నారు.


### భానుడు భగభగ



నిర్మానుష్యంగా ఉన్న సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి

సామర్లకోట: గత 10 రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. వాతారణం మార్పుతో జనం బెంబే లెత్తుతున్నారు. బుధవారం పట్టణంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఏడు గంటలకే ప్రారంభమైన ఎండ సాయంత్రం ఆరు దాటినా వేడి తగ్గట్లేదు. వర్షాలు పడాల్సిన సమయంలో ఎండలు కాస్తుండటంతో వరికి సాగునీరు అందని పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై నిర్మానుష్యంగా మారింది. వేడి నుంచి ఉపశమనం పొందెందుకు ప్రజలు చల్లటి పానియాల వైపు మొగ్గుచూపుతున్నారు.

## నీటి సమస్యను పరిష్కరించరా?



సామర్లకోటలో నాచు రంగులో తాగునీరు

సామర్లకోట: గత 15 రోజులుగా మున్సిపాలిటీ నుంచి సరఫరా అవుతున్న తాగునీరు తాగడానికి ఉపయోగపడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెండు రోజులపాటు బోరు నీరు విడుదల చేయడంతో మున్సిపల్ కుళాయిల నుంచి స్వచ్ఛమైన నీరు వచ్చింది. అయితే బుధవారం కుమ్మరవీధి, బ్రౌన్‌పేట, కోటపేట, జోనాసువారి వీధిలకు నాచు రంగుతో కూడిన తాగు నీరు కుళాయిల నుంచి వచ్చింది. సత్యనారాయణపురం, సంపెంగతోట తదితర ప్రాంతాలకు బురదనీరు వచ్చింది. ఈ నీటిని ఎలా తాగాలని స్థానికులు మండిపడుతున్నారు. ఫిల్టరు ప్లాంటులో నాలుగు బోరులు, పట్టణంలో సుమారు 13 బోర్లు ఉన్నాయి. వాటి ద్వారా తాగునీరు సరఫరా చేస్తే సమస్య ఉండదనే వాదనలు ఉన్నాయి. ఫిల్టరు చెరువులో నీటి మట్టం తగ్గిపోవడంతో నీరు నాచు రంగులో ఉంది. గోదావరి కాలువలో నీరు బురదతో ఉంది. బుధవారం కొంత సమయం ఫిల్టరు చెరువులో నీరు, మరి కొంత సమయం గోదావరి కాలువ నీటిని బైపాస్ ద్వారా ఫిల్టరు ప్లాంటుకు పంపడం వల్లే ఈ రకంగా కుళాయిల నుంచి తాగునీరు వచ్చిందనే విమర్శలు ఉన్నాయి. ఇంజినీరింగ్ అధికారులు ప్రతిరోజు తెల్లవారుజామున ఫిల్టరు బెడ్‌ను పర్యవేక్షణ చేయాలని కౌన్సిలర్లు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ ఏఈ నరసింహరావును వివరణ కొరగా, ఫిల్టరు చెరువులో నీటిని ఫిల్టరు ప్లాంటుకు పంపడం వల్లే నాచు రంగులో నీరు వచ్చిందన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య మాట్లాడుతూ, గోదావరి జలాలు కలుషితం కావడంతో ఏలేరు జలాలను పైపులైన్ ద్వారా సామర్లకోటకు తీసుకురావడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. శుద్ధి చేసిన నీటిని పైపులైన్ ద్వారా కోట్లమ్మ, నీలమ్మ చెరువులకు మళ్లించి అక్కడి నుంచి వాటర్ ట్యాంకులు నింపి సరఫరా చేస్తున్నామన్నారు. ఈ పథకం పూర్తి కావడానికి కనీసం మూడేళ్లు పట్టే అవకాశం ఉంది. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే ఏర్పాట్లు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలి



పాఠ్యాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకొంటున్న ఆర్‌జేడీ

సామర్లకోట: విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీలో భాగంగా బుధవారం మండల పరిధిలోని మాధవపట్నం శివారు ప్రాంతమైన జమునానగర్ కాలనీ ఎలిమెంటరీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ మేరకు వ్యక్తిగతంగా చిన్నారులకు చదువుపై ఉన్న పట్టును పరిశీలించారు. గణితంపై విద్యార్థులకు ఉన్న పట్టు తెలుసుకోవడానికి ఎక్కాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి ఆయా తరగతులకు చెందిన పాఠ్య పుస్తకాలను చదడం, రాయడంలో తరువుగా ఉండాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరగడానికి తీసుకొంటున్న చర్యల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో క్రమ శిక్షణ, చదువును బట్టి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై శ్రద్ధ చూపే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయప్రకాష్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జక్కంపూడి సేవలు చిరస్మరణీయం

- ఘనంగా మాజీ మంత్రి రామ్మోహనరావు జయంతి
- ఆయన సేవలను కొనియాడిన నేతలు



పిఠాపురంలో జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పిఠాపురం: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయమని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం జక్కంపూడి రామ్మోహనరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పిఠాపురం కో ఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత ఆదేశాల మేరకు రామ్మోహనరావు జయంతి వేడుకలను పార్టీ కార్యాలయంలో నిర్వహించామన్నారు. వైఎస్సార్‌తో జక్కంపూడికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జక్కంపూడి వీల్ చైర్‌కే పరిమితమైన సందర్భంలో కూడా ఆయనను రాజశేఖరరెడ్డి మంత్రిగా కొనసాగనిచ్చారంటే ఆయనపై వారికి ఉన్న నమ్మకం అటువంటిదన్నారు. జక్కంపూడి కాంగ్రెస్ పార్టీలో అనేక ఉద్యమాలు చేసి ఒంటి చేత్తో జిల్లాను శాసించారన్నారు. మంచి ఉద్యమ నాయకుడిగా పేరు తెచ్చుకుని పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో జ్యోతుల బాబులు, తలిశెట్టి వెంకటేశ్వరరావు, రావుల మాధవరావు, మాదిరెడ్డి దొరబాబు, ఉలవల భూషణం, ముమ్మిడి శ్రీనివాస్ పెదపాటి రాజేష్, సోమారౌతు లలిత,ఆలపు సుధారాణి, ఆనాల సుదర్శన్, కొత్తెం దత్తుడు, బోను దేవా, బత్తిన రాజశేఖర్, పశ్చిమళ్ల అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: పట్టణంలో వేంచేసిన తిరుమల తిరుపతి దేవస్థానాల పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి పవిత్రోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు, వేద పండితులు అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నాలుగు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ సూపరింటెండెంట్ మల్లికార్జున, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

### హిరొషిమాపై విద్యార్థులకు అవగాహన

పెద్దాపురం: సైన్స్ మానవ పురోభివృద్ధికి ఉపయోగపడాలని, వినాశనానికి కాదని ఏసీటీ సైన్స్ సెంటర్ నిర్వాహకులు బుద్దా శ్రీనివాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్, ఏసీటీ సైన్స్ సెంటర్ సంయుక్తంగా బుధవారం హిరొషిమా డే నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర అధ్యక్షతన జరిగిన హిరొషిమా–అణుబాంబు అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దా శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అణుబాంబు ప్రమాదాన్ని వివరించారు. సైన్స్ అందించిన ఫలాలు మానవులకు ఉపయోగపడే విధంగా ఉండాలని, కొంతమంది స్వార్థానికి ఉపయోగపడకూడదన్నారు. 1947 ఆగస్టు 6న జపాన్‌లోని హిరొషిమా నగరంపై అమెరికా లిటిల్ బాయ్ పేరుతో అణుబాంబు వేసిందని, దీనివల్ల జరిగిన వినాశనం నుంచి ఇప్పటికి కోలుకోలేని స్థితి ఏర్పడిందన్నారు. ఎంత అభివృద్ధి చెందినా అణుబాంబు ఫలితాలు ఇప్పటికీ మానవ జీవనంపై పడుతూనే ఉన్నాయన్నారు. యుద్ధం ప్రజలపైన తీవ్ర ప్రభావాన్ని చూపుతుందనే విషయాన్ని మనం ఎప్పటికీ మరచిపోకూడదని శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్లాట్ ఫాంలు శుభ్రంగా ఉంచాలి



సామర్లకోట రైల్వే ప్లాటుఫాంను శుభ్రం చేస్తున్న స్టేషన్ మేనేజర్

సామర్లకోట: రైల్వే స్టేషన్ పరిసరాలతో పాటు ప్లాట్ ఫాంలు పరిశుభ్రంగా ఉంచాలని రైల్వే స్టేషన్ మేనేజరు రమేష్ అన్నారు. స్వచ్ఛత పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం రైల్వే ప్లాటు ఫారాలను క్లీనింగ్ మిషన్లతో శుభ్రం చేశారు. అదే విధంగా ప్లాటు ఫారం నుంచి రైలు పట్టాల మధ్యలో చెత్త వేయడం నేరమని హెచ్చరించారు. ఎవరికి వారే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్య సమస్యలు ఉండవని చెప్పారు. ఈ మేరకు రైల్వే అధికారులు, సిబ్బంది, ప్రయాణికులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎడీఈఎన్ శివప్రసాద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు బీవీ రామసుబ్బారావు, రమణ, సంజీవ్‌కుమార్, చిరంజీవి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, టిక్కెట్ చెక్కింగ్ ఇన్‌స్పెక్టర్ చైతన్య, ఆర్పీఎఫ్ ఎస్సై ప్రవీణ్‌కుమార్, వివిధ డిపార్టుమెంట్ల హెడ్స్, సిబ్బంది పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్ బిగించొద్దు



సబ్ స్టేషన్ వద్ద వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెద్దాపురం: స్మార్ట్ మీటర్ తమ ఇంటికి బిగించొద్దని డిమాండ్ చేస్తూ తిరుపతి (దివిలి) సబ్ స్టేషన్ వద్ద బుధవారం ప్రజావేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు కేదారి నాగు మాట్లాడుతూ, విద్యుత్ స్మార్ట్ మీటరును ప్రజల అనుమతి లేకుండా వేయవద్దని చెప్పినా రూరల్ ప్రాంతంలో గోరింట ఇళ్లకు స్మార్ట్ మీటర్లు వేస్తున్నారన్నారు. దుకాణాలకు స్మార్ట్ మీటర్లు బిగించారని, అది ఏ కంప్లైట్ వచ్చినా ఆన్‌లైన్ ద్వారా రిజిస్టర్ అయిన తరువాత మాత్రమే రిపేరు చేయడం జరుగుతుందన్నారు. స్థానికంగా ఉన్న విద్యుత్ కార్యాలయం వారు దీనిని రిపేరు చేయడానికి సాధ్యం కావట్లేదన్నారు. స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.